

ఓం నమో భగవతే శ్రీ రమణయ

# రమణ భాస్కర



సంపుటి : 9 | సంచిక : 16 | పుష్పం : 33-34 | 5-5-2004

RAMANA BHASKARA
*TELUGU SPIRITUAL FORTNIGHT MAGAZINE*
PAGES : 16
VOL : 9 ISSUE : 16
EDITOR
*P.S. RAMA RAJU*
EDITING
*P.H.V. SATYAVATHI*
(HYMA)
SUBSCRIPTION
Yearly : Rs. 150/-
Each Copy : Rs. 8/-
ADDRESS
RAMANA BHASKARA
SRI RAMANAKSHETRAM
JINNURU - 534 265
W.G.Dt., A.P.
PUBLISHER
P.S. RAMARAJU
LAKSHMI
MODERN RICE MILL
ULLAMPARRU - PALAKOL
☎ 08814 - 224589, 224689
PRINTER
SHRIRAM GRAPHICS
BANK STREET - PALAKOL
☎ 08814 - 222438, 221260
94401-31188

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు 13-1-04
## కాపవరం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

కృష్ణభక్తులు ఏమంటారు అంటే అంతా కృష్ణపరబ్రహ్మం, అందులోనుండే అన్నీవస్తున్నాయి, కృష్ణుడుపాలు, పాలలోనుండి పెరుగు, మజ్జిగ, నెయ్యి అన్నీ ఎలా వస్తున్నాయో అలాగ ఈసృష్టి అంతాకూడా పంచభూతాలు, జీవకోటి, దేవతలు అంతాకూడా కృష్ణ పరబ్రహ్మంలోనుండి వచ్చింది అని చెపుతారు. కృష్ణుడు భగవంతుడై యుద్ధభూమిలో అర్జునుడికి గీతను ఉపదేశించాడు, అందుచేత దానిని భగవద్గీత అంటారు. వ్యాసుడు దానిని శ్లోకబద్ధం చేసాడు. అక్కడ చెప్పినవాడు కృష్ణుడు, విన్నవాడు కృష్ణుడు, వ్రాసినవాడు కృష్ణుడే, ఆయనకు భిన్నంగా ఏమీలేదు. ఆయనకు భిన్నంగా ఏదోఉందని అనుకోవటంవలన మనకు అహంభావన పెరుగుతుంది. జరిగేది అంతా ఆయన సంకల్పమే. ఈశ్వరుడిసంకల్పం ప్రకారం ఇదిఅంతా జరుగుతోంది అని మనకు అర్థంకాకపోవటంవలన దుఃఖం వస్తోంది. మనకు ఎంతధనం ఉన్నా, ఎంత అధికారం ఉన్నా అహంభావన నశించకుండా దుఃఖం నశించదు. అహంభావన నశిస్తే నీవు నశించవు, దుఃఖం నశిస్తుంది, పునర్జన్మరహితస్థితిని పొందుతావు. ఆధ్యాత్మికవిద్య అంటే, ఇదిఎప్పుడూ ఉండేది ఇదితాత్కాలికం, ఇదిసత్యం ఇదిఅసత్యం అనేటువంటి విచక్షణ, వివేకం కలుగుజేసేది, ఆత్మకు అనాత్మకు ఉన్న బేధాన్ని తెలియపర్చేది ఆధ్యాత్మికవిద్య.

ఈ సంచికలో......

సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు
13-01-04 కాపవరం ........ 1
13-03-04 శ్రీశైలం ........ 11



Visit us @ www.srinannagaru.com



భగవద్గీత సంపూర్ణ గ్రంథం, సమన్వయ గ్రంథం, ఉపదేశ గ్రంథము. మన జీవితం ఎలా ఉండాలి, మనం ఎలా ప్రవర్తించాలి, కర్మ అంటే ఏమిటి? మనం ఎటువంటి కర్మను ఆచరించాలి ఇలా జీవితానికి సంబంధించిన అన్ని విషయాలను అనేక కోణాలలో వివరంగా గీతలో చెప్పాడు. ఆకారములేనిది, వికారములులేనిది, చావుపుట్టుకలతో సంబంధంలేనిది మన హృదయంలోఉన్న బ్రహ్మం, దానిని అనుభవంలోనికి తెచ్చుకోవటానికి పరమాత్మ అనేక విధములుగా గీతలో వివరించాడు, ఆచార్యులవారు, గాంధీగారు, తిలక్‌గారు ఇలా చాలామంది పెద్దలు గీతకు వ్యాఖ్యానం వ్రాసారు, గీతనుప్రచారంచేసారు. గీతను అధ్యయనంచేసి, అర్థంచేసుకొని, ఆచరిస్తే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది, అది గీత యొక్క వైభవం. నూతిలో ఉన్న కప్పకు సముద్రం గురించి తెలియదు, అలాగే పెద్దమనస్సు ఉన్న వారిని మనం అర్థం చేసుకోలేము ఇంక పరమాత్మను ఎలా అర్థం చేసుకోగలము. మన మనస్సు, ఇంద్రియాలు ఆయనను పట్టుకోలేవు. మనకు అంత ఏకాగ్రత, పవిత్రతలేదు. కృష్ణుడిని అర్థం చేసుకోవాలంటే ఆయన అంత ఎత్తుకు ఎదిగితే గాని ఆయన మనకు అర్థంకాడు. ఇరుకుమనస్సు పెట్టుకొని, కురచఆలోచన పెట్టుకొని నాకు గీత అర్థం కావటంలేదు, గీతలో చెప్పినది నిజంకాదు అంటే ఇవన్నీ వక్రబుద్ధి యొక్క లక్షణం. కృష్ణుడు ఏదో ఆవేశంగా, తాత్కాలికంగా, మీ అందరికి ఆయనపట్ల ఆకర్షణ కలుగచేయటం కోసం గీతను చెప్పలేదు. అందరూ ఆత్మజ్ఞానం పొందాలి, అందరూ పరమాత్మ స్వరూపాన్ని పొందాలి అని చెప్పాడుగాని ఏదో ప్రయోజనం ఆశించి చెప్పినదికాదు, 5వేల సంవత్సరాల పూర్వం గీతలో చెప్పిన శ్లోకాలు ఎంత సత్యమో, యుగాలు మారిన అవి ఈరోజుకు కూడా అంతే సత్యం, రాబోయే యుగానికి కూడా అంతే సత్యం, అది గీత యొక్క వైభవం. పరమాత్మ నోటినుండి ఒక మాటవస్తే అది కోట్లాది సంవత్సరాలు నిలబడుతుంది ఆమాట ఆచరణయోగ్యంగా ఉంటుంది. గీత నాకు తల్లిలేనిలోటు తీర్చింది, గీతనాకు అమ్మతో సమానము అన్నారు గాంధీజీ. గీతను అర్థంచేసుకొంటే మనకు ఏకాగ్రత కలుగుతుంది, మనం ఎలా జీవించాలో తెలుస్తుంది అని చెప్పారు. గీతలో అన్ని విషయాలు వివరంగా చెప్పాడు, గీతలో చెప్పకుండా విడిచిపెట్టిన విషయం అంటూ ఏమీలేదు. ప్రతీ చిన్నవిషయం కూడా మనకు అర్థమయ్యేటట్లు క్రోడీకరించి, సమన్వయంచేసి, మన మేదస్సుకు ఎలా పట్టించాలో అలా పట్టించటానికి 18 అధ్యాయాలు చెప్పాడు. మనం సన్మార్గం విడిచిపెడితే మరల మనలను సన్మార్గంలోనికి తీసుకొనిరావటానికి ప్రయత్నం చేసారు కాబట్టి వారు అవతారపురుషులు అయ్యారు. మనకు దేశభక్తిలేదు, దైవభక్తిలేదు, పనియందు గౌరవంలేదు, బాధ్యతలేదు ఇలా రాంగ్‌డైరెక్షన్‌లో వెళుతున్న మనలను రైట్‌డైరెక్షన్‌లోనికి తిప్పటానికి, పరమాత్మ అర్జునుడిని నిమిత్తమాత్రంగా పెట్టుకొని జీవకోటికి గీతను ఉపదేశించాడు. కృష్ణుడు అంటే పరమాత్మ, ఈ జీవకోటినంతా నడిపేది ఆయనే అని ఆయన ఔన్నత్యాన్ని

గుర్తిస్తేనే గాని ఆయన మాట యందు మనకు గౌరవంరాదు, ఆయన మాట మనకు అర్ధంకాదు. ఉదయం 5 గంటలకు ట్రెయిన్‌కు వెళ్ళాలంటే మనం కంగారు పడిపోతాము. మరి యుద్ధభూమిలో భగవద్గీత ఎలా చెప్పాడు అని కొంతమంది అంటారు. జీవుడికి టెన్షన్ ఉంటుంది గాని భగవంతుడికి టెన్షన్ ఏమిటి? నీకు ఎంతకాలం అయితే దేహాత్మబుద్ధి ఉందో అంతకాలం యజ్ఞ దాన తపస్సులను విడిచిపెట్టవద్దు అని భగవంతుడు చెప్పాడు.

నీ దేహయాత్రకు సరిపడ పని చేసుకో. నీ కాలాన్ని కొంత వరకు స్వార్ధంలేకుండా సమాజానికి ఉపయోగించు. భగవంతుడు నీకు ఇచ్చిన అవకాశములను సమాజానికి ఉపయోగిస్తే నీ చైతన్యస్థాయి పెరుగుతుంది. మిగతా కాలమంతా భగవంతుడిని స్మరించుకో. నీవు గౌరవం ఆశించి మంచిపనులు చేసినా గౌరవం వస్తుంది, పుణ్యం వస్తుందిగాని జ్ఞానంరాదు. నీవు ఏమీ ఆశించకుండా, పని పని కోసమే చేస్తే నీకు జ్ఞానం కలుగుతుంది. కర్తృత్వబుద్ధి లేకుండా కర్మచేసినా, వాడు చేయని వాడితో సమానము, అంటే ఆకర్మవాడిని బంధించదు. నీవు పనిచెయ్యికాని ఎలాచెయ్యాలో తెలుసుకొని చెయ్యి. నీవు రకరకాల వస్తువులతో భగవంతుడిని ఆరాధిస్తున్నావు, ధర్మాచరణవలన భగవంతుడిని ఆరాధించవచ్చు. ఏదైతే సత్యమో, ఏదైతే నిత్యమో దానిని పొందటమే గమ్యంగా పెట్టుకో, దానిని పొందటానికి నీ తెలివితేటలు సరిపోవు, నీ సాధన సరిపోదు, ఏదో కొద్దిటైము పూజ చేస్తున్నాను, ప్రాణాయామం చేస్తున్నాను, జపం చేస్తున్నాను అంటే సరిపోదు, ఇవిఅన్నీ చేస్తున్నావు, మంచిదే కాని ఈప్రయత్నాలు ఒక్కటే సరిపోదు, మానవుడు చేసే సాధనవలన భగవంతుడిని పొందలేడు, వాడుచేసే సాధనతోపాటు ఈశ్వరునిదయ ఉండాలి, భగవంతుడి యొక్క దయలేకుండా మనం ఆయనను పొందలేము.

నీవు సమానబుద్ధిని కలిగిఉండాలి. ఈ గుణాలు, దేహం, ఇంద్రియాలు, మనస్సు ఇవిఅన్నీ ప్రకృతి వికారములు, ప్రకృతికి అతీతంగా ఉన్న పురుషుడు వాడే పురుషోత్తముడు, వాడే బ్రహ్మం, వాడిని తెలుసుకోవాలంటే బుద్ధియుక్తుడై ఉండాలి. ప్రతీమనిషికి స్నేహితులు ఉంటారు, విరోధులు ఉంటారు, ఆ సబ్జక్టు వదిలెయ్యి అందరిపట్ల సమానబుద్ధిని కలిగిఉండు. శిశుపాలుడు పెద్దసభలో కృష్ణుడిని నిందించాడు. ఆయన చాలాకాలం ఓర్పుపట్టాడు, ఓర్పును శిశుపాలుడు ఏమనుకొన్నాడు అంటే కృష్ణుడు పిరికిపంద, నా మాటలు అన్నీ పడుతున్నాడు అనుకొన్నాడు, ఎందుచేత వాడిస్థాయి అటువంటిది. మీలో మంచితనం లేనప్పడు ఎదుటివారిలో ఉన్న మంచితనం కూడా మీకు చెడ్డగా కనిపిస్తుంది. సమాజంలో కొందరు నిన్ను స్తోత్రం చేస్తూఉంటారు, కొందరూ విమర్శిస్తూ ఉంటారు, నీవు ఆమనస్సులను చూడవద్దు, అందరిలోను అంతర్యామిగా ఉన్న భగవంతుడినే చూడు, అప్పడు నీకు సమాన బుద్ధి కలుగుతుంది. సంసారంలో వచ్చే హెచ్చుతగ్గులమధ్యలో, ఘర్షణల మధ్యలో నీ బుద్ధిని సమానంగా ఉంచుకొంటే, భగవంతుడి పట్ల విశ్వాసం కలిగిఉంటే నీకు ఆయనే దారిచూపిస్తాడు.

స్మశానంలో ఈశరీరాన్ని కాల్చేస్తారు. మనం చేసే మంచిచెడులు అన్నీ జీవుడి కూడా వచ్చేస్తాయి, మంచిపనులు బంగారుసంకెళ్ళు, చెడ్డపనులు ఇనుపసంకెళ్ళు, ఇవీ బంధిస్తాయి, అవీ బంధిస్తాయి, చాలామంది మోక్షాన్ని కోరుకోరు, గొప్ప జన్మరావాలి అని కోరుకొంటారు, ఆ గొప్పజన్మ ఎంతకాలం ఉంటుంది. అదీ స్వప్నమే, ఆశరీరంకూడా ఏదో రోజు నశిస్తుంది. మనందరికి భయం ఏమిటి అంటే ఈశరీరంపోతే మనం ఉండము అనుకొంటున్నాము, తీరా మోక్షం వచ్చేస్తే ఈశరీరం ఉండదని కంగారుపడిపోయి గొప్ప జన్మరావాలి అని కోరుకొంటున్నాము. జీవుడిలో ఉన్న బలహీనత ఎక్కడఉంది అంటే ఈ శరీరం ఉంటే మనం ఉంటాము, ఈ శరీరంపోతే మనం పోతాము అనుకొంటాడు, ఈ పొరపాటుభావన నశించే వరకు జన్మలు వస్తూనే ఉంటాయి. మనం ఎంతవరకు సాధన చేయాలి అంటే దేహం ఉన్నప్పడు మనం ఉంటాము, దేహం మరణించిన తరువాత మనం ఉండము అని అనుకొంటాము, ఈ ఉంటాము, ఉండము అనే బేధం నశించేవరకూ ఈశ్వరుని పాదాలు విడిచిపెట్టవద్దు.

ప్రతీవాడు వాడికి ఇష్టం ఉన్నా లేకపోయినా వాడు చేసిన పనుల యొక్క ఫలితాలను చనిపోయిన తరువాత లగేజీ మోసుకొని వెళ్ళినట్లు మోసుకొనిపోతాడు. ఇలా లగేజీని మోసుకొని తిరగవద్దు. ఆలగేజీని వదిలేయాలి అంటే సమానబుద్ధిని ప్రాక్టీసుచెయ్యి, సత్వగుణాన్ని అలవర్చుకో. మనం కష్టపడి విద్యను ఎలా నేర్చుకొంటామో, కష్టపడి ధనాన్ని ఎలా సంపాదించుకొంటామో అలాగ కష్టపడి సత్వగుణాన్ని ప్రాక్టీసుచెయ్యాలి. సత్వగుణం నిన్ను వెలుతురులోనికి తీసుకొని వెళుతుంది. తమోగుణం రజోగుణం నిన్ను చీకటిలోనికి తీసుకొనిపోతాయి. నీవు సమానబుద్ధిని ప్రాక్టీసు చేస్తూఉంటే, అహంభావన లేకుండా జీవిస్తూఉంటే, నీ మాటలో, చేతలో, ఆలోచనలో ఆడంబరం లేకుండా చూసుకొంటే పునర్జన్మహేతువులు అన్నీ ఇప్పడే, ఇక్కడే కాలిబూడిదఅవుతాయి, నీవు నాస్వరూపాన్ని పొందుతావు అని భగవంతుడు చెపుతున్నాడు, నీవు కాలాన్ని పాడుచేసుకొంటున్నావు. ఈ దేహం ఏమైనా 10 వేల సంవత్సరాలు జీవిస్తుంది అని అనుకొంటున్నావా? ఈ కాలప్రవాహంలో నీ దేహం ఏపాటిది? చిల్లరవిషయాలకు ఈ గొప్ప మానవజీవితాన్ని వ్యర్ధంచేసుకొంటున్నావు. డబ్బును పొయ్యిలోపెట్టి కాఫీ కాచుకోవటం ఎటువంటిదో, చిల్లరవిషయాలకు రాగద్వేషాలకు మానవజన్మను పాడు చేసుకోవటం అటువంటిదే. జంతువులకు బుద్ధిలేదు, మనిషికి బుద్ధిఉంది, ఆబుద్ధిని ఉపయోగించుకొని, సత్కర్మచేస్తూ సద్గతిని పొందటానికి ప్రయత్నంచెయ్యి. 10వేల ఎకరాలు సంపాదిస్తే సమాజం నిన్ను

తలపెట్టదు, నీ కుటుంబసభ్యులు నిన్నుతలపెట్టరు, ఈ గౌరవాలు, కీర్తి నిలబడేవికాదు, ఇది మాయయొక్క ప్రభావం. నీ ధర్మాన్ని నీవు చెయ్యి. సద్గతిని పొందటానికి కాలాన్ని సద్వినియోగం చేసుకో, కాలాన్ని వ్యర్థం చేసుకొంటే, ప్రాణం పోయే టైములో కొద్దిసేపు ఆపు చేయమన్నాఆపుచేయరు. నీవు సత్పురుషులతో సహవాసం చెయ్యి, సత్పురుషులతో సహవాసంవలన సద్బుద్ధి కలుగుతుంది. మనం సమాజాన్ని మోసం చేయవచ్చుకాని భగవంతుడిని మోసం చేయలేము. నీశరీరాన్ని ఇక్కడ విడిచిపెట్టేసినట్లు నీ పుణ్యపాపాలను కూడా ఇక్కడ విడచిపెట్టేయి. నీకుకలిగిఉంటే ఇతరులకు సహాయ సహకారములు అందించు, గోవిందుని పాదాలను ధ్యానంచేసుకో, గీతను చదివి, అర్థంచేసుకొని ఆచరించటానికి ప్రయత్నంచెయ్యి, పరమేశ్వరునిలో ఐక్యం అవ్వటానికి నీ బుద్ధిని సమాయత్తం చేసుకో.

పరీక్షలు ముందు పిల్లలు ఎలా ప్రిపేర్ అవుతారో, నీ చావుకూడా పరీక్ష వంటిది, దానికి నీ బుద్ధిని సమాయత్తం చేసుకో. భగవద్గీతను, విష్ణుసహస్రనామాలను పరాయణంచేసుకో. ఆనామాలలోని వైభవాన్ని అనుభవించు. ఎలా అనుభవించాలి అంటే నీకు ఆకలి తీవ్రంగా ఉన్నప్పడు అన్నం ఎంత ఇష్టంగా తింటావో అంత ఇష్టంగా భగవంతుడిని నామాలను అనుభవించు. ప్రేమలేని జపాలు, ధ్యానాలు నిలబడవు. నీవు ధర్మాన్ని ఆచరిస్తూ, ఇతరుల మీద ఆధారపడకుండా నీకాళ్లమీద నీవు నిలబడి, ఇతరులు కూడా వారి కాళ్లమీద వారు నిలబడటానికి సహాయసహకారములు అందించు. మిగతాకాలాన్ని అంతా నన్ను స్మరించుకొంటూ, ఎలా జీవిస్తే నేను ఇష్టపడతానో అలా జీవించి తరించు అని భగవంతుడు చెపుతున్నాడు, నీపని నీవు చేయకుండా ఎక్కడికి పారిపోతావు, అలా పారిపోతే సోమరి తనం వస్తుంది గాని జ్ఞానం రాదు. నేను పనిచేసి సంపాదించవలసింది, పొందవలసింది అంటూ ఈసృష్టిలో ఏమీలేదు అయినా నేను పనిచేస్తున్నాను. కృష్ణుడే పనిచేయటం లేదు, మనం ఎందుకు పనిచేయాలి అని అందరూ కూర్చొంటారు అందుకే పనిచేస్తున్నాను అని పరమాత్మ చెప్పాడు. పని మనిషిని విడిచిపెట్టాలి కాని మనిషి పనిని విడిచిపెట్టకూడదు. అందరిలోను భగవంతుడిని చూడటం నేర్చుకో, నీకు సమానబుద్ధి కలుగుతుంది. ఒకవేళ నీకు సమానబుద్ధి లేదు అనుకో, సత్వగుణం లేదు అనుకో, సాధుసాంగత్యం లేదు అనుకో, సత్కర్మ ఎలా ఉంటుందో నీకు తెలియదు అనుకో వాటిని సంపాదించటానికి ఈరోజునుండి అయినా ప్రయత్నంచెయ్యటం మొదలుపెట్టు.

నీవు ఎవడి భక్తుడివి అయితే ఏముంది, నీ బుద్ధి పరిశుద్ధం అవ్వాలి కదా. వాడి భక్తుడయితే మోక్షం వస్తుంది, వీడి భక్తుడయితే మోక్షంరాదు అంటే అవి పిచ్చిమాటలు. బుద్ధి పరిశుద్ధం అవ్వకుండా ఆత్మశాంతి ఎలాకలుగుతుంది. మనం పాడైపోవటానికి ఒకటే కారణం, మనకు బాధ్యత లేదు. యజమాని దగ్గరఉంటే పనిచేస్తాము, యజమాని లేకపోతే అసలు పనిచేయము. ఎవడో చూస్తున్నాడు, లేకపోతే వాడు చూడటంలేదు వాడిగొడవ మనకు ఎందుకు? అసలు చూసేవాడు లోపలఉన్నాడు కదా, వాడు అంతర్యామి, సర్వసాక్షి, కర్మఫలదాత, నీకు మార్కులు వేసేవాడు నీహృదయంలోనే ఉన్నాడు, బయటలేడు. నీకు ఏదైనా తలంపు వస్తే వాడు పూర్ణంగా దర్శించగలడు, వాడే ఈశ్వరుడు. వాడు అన్నికాలాలలో, అన్నిఅవస్థలలో, అంతటాఉన్నాడు. అద్దం బాగుంటే మన ప్రతిబింబం ఎంత స్పష్టంగా గోచరిస్తుందో అలాగ ఎవడి బుద్ధిఅయితే పరిశుద్ధమయ్యిందో వాడికి హృదయంలో ఉన్న వస్తువు అంతస్పష్టంగా గోచరిస్తుంది. హృదయంలో నారాయణుడు ఉన్నాడు, వాడు లేడు అనుకొంటే అది మన బుద్ధిలోఉన్న దోషంవలన, అలా అనుకొంటున్నాము. మనం ఇష్టాయిష్టాలు పెంచుకొంటే పరమాత్మ మనప్రక్కన కూర్చొన్నా మిస్అయిపోతాము. ధుర్యోధనుడికి, శిశుపాలుడికి, కంసుడికి కృష్ణుడు ఎవరో అర్థం అవ్వలేదు. అర్హత, యోగ్యత మనకు లేనప్పడు పరమాత్మ మనప్రక్కన కూర్చొన్నా మనం గుర్తించలేము. నీవు పనిచేస్తున్నావు, దాని వలన ఫలితం ఏదో వస్తుంది. నీవు ఆశించటం వలన ఎక్కువరాదు, ఆశించకపోవటం వలన తక్కువ రాదు, వచ్చేదిఏదో వస్తుంది. ఫలకాంక్ష వలన నీబుద్ధి శుద్ధి అవ్వదు. నీవు చేసేపని సమానంగా చెయ్యి, ఫలితం గురించి ఆశించవద్దు, పనిబాగా చేయటమే కాదు ఆపనితాలూక ఫలితం నిన్ను అంటకుండా చూసుకో, ఆరకంగా పనిచేయటం, కౌశలం, అలా పనిచేస్తే నీబుద్ధి శుద్ధిఅవుతుంది. ఈశ్వరుడిని నిరంతరం స్మరించటం వలన నీకు తెలియకుండానే దేహభావన రాలిపోతుంది. ఎవడికి ఇష్టమైన పని వాడు ఎలాగు చేసుకొంటాడు, అదికాదు, నాకు ఇష్టమైన పని నీవు చేస్తే నా స్వరూపాన్ని పొందుతావు అని భగవంతుడు చెపుతున్నాడు, ఆయన స్వరూపమే మోక్షం. మనం పని చేయటానికి పనికి వస్తాము కాని ఫలితం మన చేతిలోలేదు, మనం చేసేపని ఈశ్వరార్పణబుద్ధితో చెయ్యాలి, వాడి అనుగ్రహం కోసం పనిచెయ్యండి, వాడి దయను సంపాదించండి. మనచేతిలో ధనం ఉంటే బజారులో ఉన్న వస్తువును కొనుక్కోవటం ఎంతతేలికో ఆయన దయ ఉంటే మనకు మోక్షం రావటం అంత తేలిక. నీ మాట, నీచేత, నీ ఆలోచన భగవంతుడి దయను సంపాదించటానికి నీకు సహకరించేవిగా ఉండాలి.

**భగవంతుడు నీకు ఏపని కేటాయించాడో ఆపని చేసుకొంటూవెళ్ళు. నీపొట్టను పోషించుకోవటానికి నీవు చేసేకర్మలు అన్నీ నిష్కామకర్మలు అని అనుకోవద్దు. నీ పొట్టకోసం ఇతరులమీద ఆధారపడవద్దు, ఇతరులుమీద ఆధారపడితే బానిసత్వంవస్తుంది. పొట్టకోసం ఏదోపనిచేస్తూ, అదేనిష్కామకర్మఅని, దేశాన్ని ఏదో ఉద్ధరిస్తున్నానని అనుకోవద్దు. అహంభావరహితంగా, ఆడంబరరహితంగా, స్వార్థరహితంగా, పనిచేస్తూఉంటే భగవంతుడు ఎలా నిశ్శబ్దంగా పనిచేస్తున్నాడో అలా నీవు పనిచేస్తూ ఉంటే అదినిష్కామకర్మ, మనకు**

ఎంతసేపు నేనును వాడటమే పని. ఏవడో చేసిన పనిని కూడా నేను చేసానుఅంటాము. భగవంతుడు ఉన్నాడు, ఉన్నానని అనడు. పనిచేస్తున్నాడు, నేను చేస్తున్నాను అని అనడు. అలా మనతో చెప్పటం కాదు, వాడు అనుకోడు, అలా మనం కూడా ఉంటే మనం దేవుడు అవుతాము అంటే భగవంతుడి స్వరూపాన్ని పొందుతాము, భగవంతుడు ఎలా పనిచేస్తున్నాడో మనం అలా పనిచేయటం నేర్చుకొంటే కర్మద్వారా భగవంతుడిని ఆరాధించినట్లు అవుతుంది. ప్రస్తుతం మనం ముగ్గులు పెట్టటం, దీపాలు పెట్టటం, పుష్పాలు పెట్టటం నేర్చుకొన్నాము కానిపనిద్వారా భగవంతుడిని ఎలా ఆరాధించాలో నేర్చుకోలేదు. ఇంకా నేర్చుకోలేదు అని అనుకోవద్దు నేర్చుకోమని ఇక్కడ భగవంతుడు చెపుతున్నాడు. మీరు చేసేపని వలన మీకు భయంరాదు. ఇంకా ఆపని అవ్వదు అని అనుకొన్నప్పడు మనకు భయం కలుగుతుంది. అప్పడు కూడా మీారు భయ రహితంగా ఉంటే ఈశ్వరుడిదయ మీమీద వర్షిస్తుంది, మీరు ఏవిషయంగురించి అయితే భయపడుతున్నారో దానిని మీాకు అనుకూలంగా తిప్పతాడు వాడే భగవంతుడు. ఆయన ఎప్పడు కలుగజేసుకొంటాడే, మీ జీవితాన్ని ఎప్పడు మలుపు తిప్పతాడో చెప్పలేము. భగవంతునియందు ప్రేమని, భక్తిని కాపాడుకొంటూ రావాలి. ఇతరులను ఉద్ధరించటం, సమాజాన్ని ఉద్ధరించటం మాట అటు ఉంచండి, భగవంతుని యందు భక్తిలేకుండా ఆయన దయలేకుండా ఒకచిన్నకోరికనుండి కూడా మనం విడుదల పొందలేము. సంస్కర్తలు కావలెను సంస్కర్తలు కావలెను వారిని వారు సంస్కరించుకొనే సంస్కర్తలు కావలెను అన్నాడు రామతీర్థ. వారిని వారు సంస్కరించుకొంటే వారు బాగుపడతారు, దేశం బంగారం అవుతుంది. ఏమంచివాడు కూడా నేను ఎవరినో ఉద్ధరించాలని అనుకోడు, ఆ ఉపాధిద్వారా పనిజరిగిపోతూ ఉంటుంది. నీవు ఎవరికైనా సహకరించగలవు, అవకాశం కల్పించగలవు కాని ఉద్ధరించలేవు, ఉద్ధరించబడటం అనేది వాడిచేతిలోనే ఉంది.

నేను ఇదిచేసాను, నేను అదిచేసాను అని అనుకోవద్దు. ఈ సృష్టిఅంతా భగవంతునిది, మీది నాదికాదు. ఈజీవకోటిలేనప్పడు, పంచభూతాలు లేనప్పడు, సృష్టి స్థితిలయాలు లేనప్పడు ఎవడైతే ఉన్నాడో వాడే భగవంతుడు, వాడే కృష్ణుడు, వాడే ఈశ్వరుడు, వాడే నారాయణుడు, కర్మఫలానికి నీవు హేతువు కావద్దు, అంటే ఏదైనా మంచిపనిచేసి ఫలితం రావాలని అనుకోవద్దు. ఇలా అనుకోవటం వలన అజ్ఞానం, అవిద్య పెరుగుతుంది, ఏమీ అనుకోవద్దు. కోరికతో తెచ్చుకొన్నది నిన్ను బంధిస్తుంది, దానంతట అదే వస్తే రానియ్యి. నీకు తెలిసినా, తెలియకపోయినా నీవు బ్రహ్మమే, నీవు చైతన్యమే. దానికి భయంలేదు, హెచ్చుతగ్గులు లేవు, వికారములు లేవు. కాని నీకు జయం వచ్చినప్పడు ఒకరకంగా ఉంటావు, అపజయం వచ్చినప్పడు ఒకరకంగా ఉంటావు. ఈ హెచ్చుతగ్గులు అన్నీ నీ మనస్సుకు వస్తున్నాయి, అదే నీవు అనుకొంటున్నావు. మనస్సుకు చైతన్యానికి ఏమీ సంబంధంలేదు. మనస్సుకు వచ్చే గొడవలను చైతన్యం మీద ఆరోపించుకొంటున్నావు, అందువలన నీకు భయం కలుగుతోంది. ఇవిఅన్నీ మనస్సుకు సంబంధించిన గొడవలు, దీనికి చైతన్యానికి ఏమీ సంబంధం లేదు అని నీకు అర్ధమయితే భయకారణం ఉన్నా నీవు ఏమీభయం లేకుండా ఉంటావు, కోపకారణం ఉన్నా కోపంలేకుండా ఉంటావు. దుఃఖంవస్తే కృంగిపోవద్దు, సుఖంవస్తే పొంగిపోవద్దు. పొంగిపోవటం, కృంగిపోవటం ఇవన్నీ వికారములు. వికారములు ఉన్నవాడు ఆధ్యాత్మికవిద్యకు అర్హుడుకాడు. మనస్సును సమానంగా ఉంచుకోవాలి. దేహంప్రారబ్దం అనుభవించటానికి వచ్చింది, ఆదేహాన్ని ప్రారబ్దానికి వదిలేయండి. ప్రారబ్దం హెచ్చుతగ్గులను తీసుకొనివస్తుంది. ఇవి అన్నీ దేహానికి, మనస్సుకు సంబంధించిన విషయాలు ఆగొడవలకు నీకు ఎట్టి సంబంధంలేదు. నీవు చావులేని సత్‌పదార్ధం. గాలివేస్తే, ఆకు అటుఇటు కదిలిపోతుంది. అలాగ ప్రారబ్దంలో జరిగే సంఘటనలకు అటుఇటు కదలకుండా నీవు నిశ్చలంగా, నిర్మలంగా, నీపనిఏదోనీవు చేసుకుంటూ పోతూఉంటే ఈశ్వరుని దయకు పాత్రుడవుతావు. ఇష్టాయిష్టాలు ఉన్నవాడు స్థితప్రజ్ఞుడు అవ్వలేడు, జీవన్ముక్తుడు అవ్వలేడు. జీవన్ముక్తుడవు అవ్వలేకపోయినా విదేహముక్తుడివి అవ్వటానికి నీవు ప్రిఫేర్ అవ్వు అని రామకృష్ణుడు చెపుతూ ఉంటే ఒకభక్తుడు ఏమన్నాడు అంటే భాగవతంలో అజామీళుడు అనేవాడు అన్నీ మంచిపనులు చేయలేదు, కొన్ని చెడ్డపనులు చేసాడు అయినా మరణటైములో నారాయణ, నారాయణ అని స్మరిస్తే వాడికి మోక్షం వచ్చింది కదా అంటే వాడు పూర్వజన్మలో ఎన్నో సత్కర్మలు చేసాడు, ఏదోచిన్నదోషం ఉండి ఈజన్మలోనికి వచ్చి అనుభవించాడు, ఆదోషం నారాయణస్మరణ వలన పోయింది. అలా ఇతరులతో పోల్చుకోవద్దు. నీ అర్హత, యోగ్యత ఏమిటో చూసుకొని నీవు అభివృద్ధిలోనికి రావటానికి ప్రయత్నంచెయ్యి. ఒకవ్యక్తి మాటను ఆదర్శంగా తీసుకో అంతేగాని అలాగే జీవించాలని అనుకోవటం అమాయకత్వం అని రామకృష్ణుడు చెప్పాడు. ఎవరో ఏదో సత్కర్మ చేసారని మీారు చేయటంకాదు, మీ పద్ధతిలో మీరు సత్కర్మచేయండి, అనుకరణవద్దు. ఎవరో తిన్నారని మీరు తినవద్దు, మీ శరీరానికి ఏది పడితే అది తినండి, అనుకరణ పరికివాడి లక్షణం.

ఈప్రపంచం నాటకం లాంటిది, అందులో మనం పాత్రదారులం, ఎవరిపాత్రవారు చక్కగా పోషించి బయటకుపోవటం మంచిది అన్నాడు షేక్సిఫియర్, లోకంలో అనేక ఆకర్షణలు ఉన్నాయి. నీకులోపల వేరుభావన ఉన్నంతకాలం ఏదోఆకర్షణకు గురిఅవుతూ ఉంటావు. ఈ ఆకర్షణలన్నింటిని నీబుద్ది ఓవర్‌కమ్ చేసేవరకు నీవు విసుగు వచ్చేలాగ ఆత్మగురించి, చైతన్యం గురించి శ్రవణంచేయవలసిందే, ఈజ్ఞానయజ్ఞాలు చేయవలసిందే,

సద్గ్రంథపఠనం, తీర్థయాత్రలు, నదులలో మునగటం, ఈపూజలు జపాలు ఇవిఅన్నీ నీవు ఆత్మజ్ఞానం సంపాదించినప్పుడు అందులో సమాప్తం అవుతాయి. ఇప్పుడే సమాప్తం అయిపోయినాయి అని అనుకోవద్దు, అప్పటివరకు వాటికి ముగింపులేదు. మోహకలిలంలో నుండి బయటకు వచ్చేవరకు భగవంతుడి గురించి వింటూఉండాలి, సాధనచేస్తూఉండాలి. లోకవిషయాలపట్ల ఆసక్తి తగ్గేవరకు, వాటిమీద విరక్తి వచ్చేవరకు ఆత్మగురించి శ్రవణం చేయవలసిందే. మేము సాధన చేస్తున్నాము కాని ఫలితం కనబడటం లేదు అంటే మనకు ఉండవలసినంత వైరాగ్యంలేదు. డ్యూటీమానివేస్తే నీబుద్ధి మోహాన్ని దాటదు, డ్యూటీచేస్తూ ఉండగానే నీబుద్ధి మోహాన్ని దాటాలి. జీవుడు భగవంతుడిని చింతించగా చింతించగా భగవంతుడు అయిపోతాడు. జీవుడు దేవుడు అవ్వాలి గాని దెయ్యం అవ్వకూడదు. జీవుడిని దేవుడు అవ్వనివ్వదు ఈసమాజం. జీవుడు దెయ్యం అయితే సంతోషిస్తున్నారు కాని దేవుడు అయితే ఏడ్చేవారు ఎక్కువమంది ఉన్నారు, ఆస్పృహనీకు వద్దు, అదిలోకం, దానిపోకడ అలా ఉంటుంది అని భగవంతుడు చెపుతున్నాడు.

నీ ఆత్మవిశ్వాసాన్ని ఇతరులు ఎవరైనా బలహీనపరుస్తూఉంటే నీవు బలహీన పడవద్దు, నీవు వారి వలలో పడవద్దు, అదినీకు పరీక్షవంటిది. అలా ఇతరులు ఎవరైన బలహీనపరుస్తూ ఉంటే నీవు బలహీనుడివి అయితే భగవంతుడిని పొందటానికి నీవు పనికిరావు. భగవంతుడు మనకు తండ్రిలాంటివాడు కాబట్టి ఇంత విశ్లేషణ చేసి చెపుతున్నాడు. ఎవరితోను అతిగా స్నేహం చేయవద్దు, ఏ ప్రదేశం మీద అతిగా ఎటాచ్‌మెంట్ ఉండకూడదు. అదికూడా నీ బలహీనత, నీమనస్సు చెదిరిపోవటానికి అదికారణం అవుతుంది. ఎందులోను అతిపనికిరాదు, ఉదాసీనంగాఉండండి. ఎటాచ్‌మెంట్ భగవంతుడితో పెట్టుకొంటే మిగతా ఎంటాచ్‌మెంట్లు అన్నీ ఆయనే తీసేస్తాడు. చివరలో ఆయనమీద ఉన్న ఎటాచ్‌మెంట్‌ను కూడా ఆయనే తీసేస్తాడు ఎందుచేతనంటే ఆయన మీద ఉన్న ఎటాచ్‌మెంట్ కూడా పోతేగాని మనం హృదయంలో ఉన్న నిజం దగ్గరకు వెళ్ళలేము. విషయాలను స్మరించవద్దు, భగవంతుడిని ధ్యానించు, భగవంతుడిమీద గౌరవంపెంచుకో, భగవంతుడు ఉన్నాడని విశ్వాసం పెంచుకో, భగవంతునిమీద ఆపుకోలేని ఆకర్షణకలగాలి. పరిస్థితులు నీకు అనుకూలంగా ఉండవచ్చు లేక ప్రతికూలంగా ఉండవచ్చు, అవిఅన్నీ తాత్కాలిక విషయాలు, వాటిని చూసి నీబుద్ధిని పాడుచేసుకోవద్దు, నీభావనాబలాన్ని విడిచిపెట్టవద్దు, శాంతిని కాపాడుకో. శాంతిలేనివాడికి సుఖంలేదు. చావుపుట్టుకలు పెద్దజబ్బులు, కేన్సర్ అయిన తగ్గవచ్చు కాని ఈజబ్బుతగ్గదు. ఈ జబ్బులోనుండి నిన్ను విడుదల చేసేవాడు నారాయణుడు ఒక్కడే.

గతాన్ని గురించి శోకించవద్దు, భవిష్యత్ గురించి ఊహించవద్దు.





వర్తమానకాలంలో సజీవంగా జీవించు. భగవంతుని నామాన్ని స్మరించగా స్మరించగా, ఆయన రూపాన్ని ధ్యానించగా ధ్యానించగా నీవు నామరూపరహితస్థితిని పొందుతావు. ఏపనిచేసిన ఖ్యాతికోసం చేయవద్దు, ఈశ్వరుని దయను సంపాదించటంకోసం పనిచెయ్యి. నీ మనస్సుకు శాంతి కలిగింది అనుకో, నీబుద్ది శుద్ధి అయ్యింది అనుకో, లోపలఉన్న ఆనందసముద్రంతో అనుబంధం ఏర్పడింది అనుకో ఎన్ని దుఃఖాలువస్తే నీకేమి? నీవు బ్రతికుండగానే శోఖంలేనిస్థితిని పొందుతావు. ఈలోకంఅంతా రాగద్వేషాల పుట్టఅనుకో, ఈలోకం అంతా దుఃఖాల పుట్టఅనుకో ఇది అంతా నీకు ఎందుకు? నీబుద్దికి ప్రసన్నత్వం కలిగితే, నీకు శాంతి అందితే అది నీకళ్ళద్వారా, నీమాట ద్వారా చిందులు తొక్కుతూ ఉంటుంది. అహంభావన మీహృదయంలో అణిగిపోతే, మీకు అమృతానుభవం కలిగితే ప్రపంచంలో ఎంత దుఃఖం ఉంటే ఆగోలనీకేల? విషయాలు తప్పించి ఈలోకంలో ఏమి ఉంది. నిర్విషయస్థితి నీహృదయంలో ఉంది. ఎన్నాళ్ళు ఈ లోకాన్ని నాకుతావు. లోకం దుఃఖాలయం, అది అశాశ్వతం అన్నాడు కృష్ణుడు. సంపద ఉన్నప్పుడు నీవునీవుగానే ఉన్నావు, సంపదలేనప్పుడు నీవు నీవు గానే ఉన్నావు. కాని సంపద ఉన్నప్పుడు ఏదోవచ్చింది అని ఊహించుకొని నీవు గర్వపడుతున్నావు, సంపదలేనప్పుడు ఏదోపోగొట్టుకొన్నానని ఊహించుకొని దుఃఖపడుతున్నావు. అదీ వికారమే, ఇదీ వికారమే. అదీ ఇదీ కూడా అశాంతిని తీసుకొనివస్తుంది. ఈద్వంద్వాల నుండి విడుదల పొందటానికి ప్రయత్నంచెయ్యి, ఉద్రేకపడవద్దు, కూల్‌గా ఉండు. చనిపోయిన తరువాత ఏమౌతాము అనే భయం మనకు ఎందుకు? మనకూడా గోవిందుడు లేడు అనుకొన్నప్పుడు మనకి భయం అంతేగాని మనకూడా గోవిందుడు ఉన్నప్పుడు మనకు భయం ఏల?

విషయాలను చింతించటం వలన విషయాలలో నుండి విడుదల పొందలేవు భగవంతుడిని స్మరించటం వలన విషయాలనుండి విడుదల పొందుతావు. మనహృదయంలో నారాయణుడు అంతర్యామిగా ఉన్నాడు. మీరు హృదయంలోనికి వెళితే మీకు బండెడు దుఃఖం ఉన్నా బండెడు సుఖంగా మారిపోతుంది. నీబుద్ధిలో ఎన్ని దోషాలు ఉన్నా, ఎన్ని బలహీనతలు ఉన్నా నామీద ప్రేమకలిగితే ఆదోషాలనుండి, ఆబలహీనతలనుండి నిన్ను విడుదలచేసి నా స్వరూపాన్ని నీకు ఇచ్చే వరకు నిన్ను వెంటాడుతాను అని భగవంతుడు చెపుతున్నాడు. గీతను అధ్యయనం చేసి నీకు ఎంతవరకు అర్థమయ్యిందో అంతవరకు నీవు ఇతరులకు చెప్పటంలో అశ్రద్ధ పనికిరాదు, అలా ఇతరులకు అర్థమయ్యేలాగ ఎవడైతే చెపుతున్నాడో వాడంటే నాకు ఇష్టం, అంతకంటే ఇష్టుడు, భక్తుడు ఈలోకంలో ఎవడూలేడు అని పరమాత్మ చెపుతున్నాడు. మనం ఎప్పుడయితే ఈశ్వరుడిని స్మరించటం మానివేసామో, ఈశ్వరుని మాటను గౌరవించటం మానివేసామో మనం ప్రమాదంలో పడతాము, మమూలు ప్రమాదంకాదు అది కొన్ని వేలజన్మలను తీసుకొని వస్తుంది. అందువలన అశ్రద్ధ

పనికిరాదు, అజాగ్రత్త పనికిరాదు, నిరంతరం భగవంతుడిని స్మరించండి, ఆయన మాటను ప్రమాణంగా తీసుకొని జీవించండి, మీకు మోక్షం కలుగుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు 13-3-04, శ్రీశైలం

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఆంధ్రాలో ఉన్న ముఖ్యమైన పుణ్యక్షేత్రాలలో శ్రీశైలం ఒకటి. ఈ రోజు మనం శ్రీశైలం వచ్చినందుకు, మల్లిఖార్జునుడిని దర్శనం చేసుకొన్నందుకు మనహృదయాన్ని మల్లిపూవులాగ చేసుకోవాలి.ఎవరైతే వారి హృదయాన్ని మల్లిపూవులాగ చేసుకొన్నారో వారికి శివానుగ్రహం కలుగుతుంది. కోరికలేనివాడు,కోపంలేనివాడు, భయంలేనివాడు,కాలం లేనివాడు శివుడు వాడిని పట్టుకొంటేనేగాని మనం కోరిక,కోపం, భయం వీటిలోనుండి విడుదలపొందలేము.పరమాత్మను ఆశ్రయించకుండా, ఆయనను భజించకుండా కోరికలోనుండి, కోపంలోనుండి, భయంలోనుండి బయటపడలేము. ఈశరీరానికి, ఈ లోకానికి మనలను ఏ విషయాలు అయితే బంధిస్తున్నాయో ఆ విషయాలనుండి విడుదల పొందకపోతే మరల శరీరం వచ్చేస్తుంది.శరీరంవస్తే లోకం వస్తుంది, లోకం వస్తే పుణ్యపాపాలు, రాగద్వేషాలు అన్నీవచ్చేస్తాయి, మరల కర్మచక్రంలో జననమరణ చక్రంలో అలా కొట్టుకొనిపోతూ ఉంటాము. మనిషి కోరికవలనపుడతాడు.పుట్టిన తరువాత కోపంవలన. భయంవలన భౌతికంగాను, ఆధ్యాత్మికంగాను పతనమవుతున్నాడు. కొంతమంది భయంవలన మంచిపనులు చేయలేరు. అందుచేత ఎవరి కోపంవారికే శత్రువు,ఎవరి భయంవారికే శత్రువు,మన ప్రాణాలను తీసేది యముడు,ఆయన ఆత్మజ్ఞాని. యముడికి దొరకవద్దు అంటున్నారు భగవాన్,ఆయనకు దొరికితే మరల కాలంలోనికి వచ్చేస్తాము అంటే మరలపుడతాము. అంటే ఈ కాలప్రవాహంలో ఆదేహప్రారబ్దాన్ని బట్టి కొంతకాలం ఉంటాము తరువాత ఆశరీరం నశిస్తుంది.ఈ జననమరణ ప్రవాహంలో నుండి విడుదలపొందటమే ఈజీవుడి యొక్క గమ్యం.

ఈశ్వరుడు అంటే నియమించేవాడు అని అర్థం. పంచభూతాలను నియమిస్తున్నాడు.లోకాన్ని నియమిస్తున్నాడు, ఈజీవకోటిని వారి దేహప్రారబ్దాన్ని ననుసరించి నడిపిస్తున్నాడు.వాడే పరమాత్మ. మనం పొందవలపింది ఆయననే పరమాత్మకు ఒకరూపంలేదు, ఒకనామంలేదు, ఆయన అంతటా వ్యాపించి ఉన్నాడు. ఆయనను పొందటానికి మనం ఉపాసన చేయాలి. మీకు ఇష్టమైన దేవతారూపాన్ని ధ్యానం చేసుకోవటం, ఆనామాన్ని స్మరించుకోవటం ఉపాసన. ఉపాసన వలన మనస్సుయొక్కచాపల్యం తగ్గుతుంది. పునర్జన్మ కారణాలు అన్నీ మనస్సులో ఉన్నాయి. ఈశ్వరుని దయలేకుండా మనస్స నశించదు, మనోనాశనం అయితేగాని





పరమాత్మానుభవం కలుగదు, భగవదనుభవం కలిగితేనే గాని కాలం మనలను విడిచిపెట్టదు. ఈరోజు అందరం బాగానే ఉన్నాము, రేపు మరణించవచ్చు,మనందరం కూడా కాలానికి దొరికేస్తాము. ఆకాలానికి ఎవడైతే దొరకడో వాడే జ్ఞాని. మనకు జన్మవస్తే, మరణం వస్తుంది. మరణంవస్తే మరల జన్మవస్తుంది. ఇందులోనుండి బయటపడాలంటే వూరికే పొడిపొడి మాటల వలన వీటిలో నుండి బయటపడలేవు. పరమాత్మగీతలో ఏమి చెప్పాడు అంటే నువ్వు ఆత్మజ్ఞానం పొందటానికి పనివిడిచిపెట్టి ఎక్కడికో పారిపోనక్కరలేదు, నీధర్మాన్ని నీవు నిర్వర్తించుకొంటూ, నీ మనస్సును బాగుచేసుకొంటూ మల్లెపూవులాగ చేసుకొంటూ, శరీరఆరోగ్యాన్ని కాపాడుకొంటూ ఈశరీరం కాలానికి లోబడకముందే, కాలాన్ని జయించి బయటకు రమ్మని పరమాత్మ చెపుతున్నాడు.

ఏ వస్తువులో అయితే సుఖం ఉందో ఆవస్తువు మనకు అనుభవంలోనికి వచ్చే వరకు మనం బతికి ఉండగా సుఖపడలేము, మరణానంతరం సుఖపడతామా అంటే అప్పడు కూడ సుఖపడలేము. ఇంట్లో ఎక్కువ బాధలు ఉన్నవారు చావువస్తే బాగుండును, సుఖపడవచ్చు అనుకొంటారు. చావువచ్చినంత మాత్రంచేత సుఖంరాదు, జ్ఞానంరాదు, శరీరం మారుతుంది అంతే, మనకు ఉన్న సంస్కారములను బట్టి, వాసనలనుబట్టి ఇతరలోకాలకు ప్రయాణాలు చేస్తాము కాని ఆలోకాలు అన్నీకూడా మనం చేసుకొన్న పుణ్యపాపాలు అనుభవించటానికి పనికివచ్చేలోకాలే గాని సాధనకు పనికివచ్చే లోకం ఒక్కటీలేదు. అందుచేత మనం కాలాన్ని పాడుచేసుకోకూడదు. కాలాన్ని పాడుచేసుకొంటే మనం కాలానికి దొరికిపోతాము అంటే మరణానికి దొరికిపోతాము. మీ మనస్స ఒకవేళ బహిర్ముఖమయితే కంగారుపడకండి, భగవంతుడు చెప్పినట్లు జీవిస్తూ, మీ శరీరయాత్రకు సరిపడ పనిచేసుకొంటూ, సమాజంపట్ల మీకుటుంబంపట్ల మీబాధ్యతలు నిర్వర్తిస్తూ బ్రతకండి. మనస్స అంతర్ముఖమయితే ఆత్మదర్శనం కలుగుతుంది. మనం ఇలాగ లాభం పొందాలి, అలాగయినా లాభం పొందాలి అంటున్నారు భగవాన్. మనం భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా ఎప్పడో సడన్‌గా ఆయనే ముహూర్తం పెట్టుకొని మన మనస్సును ఆయన వైపుకు తిప్పకొంటాడు.

ఉన్నది ఒక్కటే వస్తువు అంటున్నారు, ఉన్నది ఒక్కటే అయితే అది ఒకటిగా కనబడాలిగాని మనకు అనేకంగా ఎందుకు కనబడుతోంది అని అడుగుతున్నారు. అది వస్తువులో ఉన్న దోషంకాదు, మన బుద్ధిలో ఉన్నదోషం. ఉన్నవస్తువు ఉన్నట్టుగా కాకుండా దానికి భిన్నంగా ఏదైనా కనిపిస్తూ ఉంటే అక్కడ ఏదో ఉందనికాదు, మన అజ్ఞానం వలన అలాకనిపిస్తోంది. ఈ అజ్ఞానం నశించాలంటే కేవలం పొడిపొడి మాటలవలన,జిమ్మిక్కుల వలన అది నశించదు. శరీరాన్ని, మనస్సును స్వాధీనం చేసుకొని, ఈశ్వరార్పితంగా పనిచేస్తూ

ఉంటే, మనం భగవంతుడికి పుష్పాలు, పళ్ళు, డబ్బు ఎలా ఇస్తున్నామో అలాగ మన మనస్సును భగవంతుడికి ఇచ్చేస్తే ఆయన అనుగ్రహం మనకు కలుగుతుంది, అప్పడు అజ్ఞానం నశిస్తుంది, జ్ఞానం మనకు స్వరూపంగా వ్యక్తమవుతుంది. ఆత్మానుభవం కలిగేవరకూ ఏదో వెలితి,ఏదో కొరత మనలను ప్రతీజన్మలోను వెంటాడుతుంది. వారిలాగఉంటే బాగుండును, వీరిలాగ ఉంటే బాగుండును అని మనం, తెలియక అలా అనుకొంటాము కాని వారికి ఎంత దు:ఖం ఉందో మనకు తెలియదు, అది బాహ్యదృష్టి, వారిలాగ, వీరిలాగ ఉండటంకాదు, ఆత్మఎలా ఉందో అలాగ ఉండాలి, అప్పడు ఆత్మానుభవం కలుగుతుంది. మనం దేహం అనుకొన్నంత కాలం, కాలానికి పరిమితమై ఉంటాము. ఈ దేహం ఉండగానే దేహంలేనిస్థితిని ఎప్పడైతే పొందావో అప్పడు కాలం మన జోలికిరాదు, ఏదో కాలంలో ఈదేహంపడిపోతుంది, దేహంపోయినా మనం ఉంటాము అన్నసంగతి మనకు తెలుస్తూ ఉంటుంది, ఆ ఉండటంకూడా ఆనందంగా, శాంతిగా ఉంటాము. ఇప్పడు మనం మల్లిఖార్జునస్వామిని దర్శించి వచ్చాము, మనలను మహర్షులు అనరు. ఉన్న వస్తువును ఉన్నట్లుగా దర్శించినవాడు మహర్షి. భగవంతుడి యొక్క నిజారూపాన్ని ఎవడైతే అనుభవైక వేద్యం చేసుకొన్నాడో వాడే మహర్షి.

ఇప్పడు మనం ఏదైతే నేను,నేను అంటున్నామో దానిని చూసిపొంగిపోవద్దు, అది కళంకంతో కూడుకొన్నది, నిన్నుపాడుచేసేది అదే అంటున్నారు భగవాన్. ఏ నేను అయితే మనలను పాడుచేస్తోందో అదే మనం అనుకొంటున్నాము, దానిని కూడా వేసుకొని తిరుగుతున్నాము. మనకు ద్వేషం తీసుకొనివచ్చేది, వేరుభావన తీసుకొని వచ్చేది కూడా ఆ నేనే, అదే ఒక కోతి, ఇంకా పాడవటానికి కల్లు తాగుతోంది, ఇంకా దాని శాంతి పోవడానికి ఒకతేలు కుట్టింది.ఇంక దాని చేష్టలు ఎలా ఉంటాయో చూడండి. ఏదైతే నీకు నేనుగా వ్యక్తమవుతోందో అదే నీవు అనుకొని దానిని కూడా వేసుకొని ఇలా ఎంతకాలం తిరుగుతావో అంతకాలం నీకు కష్టాలు తప్పవు, బాధలు తప్పవు, నష్టాలు తప్పవు, గుర్రం కదిలితే దాని వెనకాల బండి ఎలా వచ్చేస్తుందో అలాగ ఈ మిధ్యానేను ఉన్నంతకాలం పెంటఅంతా వచ్చేస్తుంది. నీకు తెలిసినా, తెలియకపోయినా సత్యవస్తువు నీ హృదయంలోనే ఉంది. నీవు పూజచేసినా, జపంచేసినా, ధ్యానం చేసినా, ఎన్నిచేసినా, నీ హృదయంలోఉన్న వస్తువు నీకు అనుభవంలోనికి రాకుండా ఏవైతే అడ్డుగా ఉన్నాయో వాటిని తొలగించుకోవటానికే ఇవి అన్ని చేస్తున్నావు. మనందరకు మరణం అంటే భయం, మనం మరణంలేని వస్తువుగా ఉన్నాము కాని దానికి సంబంధించిన ఎఱుక లేకపోవటం వలన నశించే శరీరం మనం అనుకోవటంవలన అది మరణించినప్పడు మనం మరణిస్తున్నాము అనుకొంటున్నాము, మరణం అంటే భయం కలుగుతోంది. మనందరం అజ్ఞానమనే నిద్రలో ఉన్నాము. మనం ఏదిగా ఉన్నామో అది తెలియకపోవటమే అజ్ఞానం, మనం ఏదిగా ఉన్నాయో అదితెలిస్తే





జ్ఞానం.

ఈ రోజు ఇక్కడ సబ్జక్టు శ్రవణం చేస్తున్నారు అంటే అది మీ తెలివి తేటల వలన కాదు,ఏదో పూర్వ పుణ్యం ఇక్కడకు తీసుకొని వచ్చింది, మీరు చేసిన సత్కర్మలు ఇక్కడకు తీసుకొని వచ్చాయి. సత్కర్మల బలం లేదు అనుకోండి, కేవలం మీతెలివి వలన పట్టుకొనేది కాదు.నిద్రావస్థ,స్వప్నావస్థ, జాగ్రదవస్థ ఈ మూడూ కూడా అజ్ఞానంలో జరిగిపోతున్నాయి, ఆత్మకు ఈ అవస్థలులేవు ఈశరీరం ఏదోరోజు చనిపోతుంది, అదికూడా స్వప్నంలో భాగమే. మరల కొత్త శరీరం వస్తుంది అదికూడా స్వప్నంలో భాగమే. మనకు నిద్రలో ఒక స్వప్నం వస్తుంది, ఆగిపోతుంది, మరల ఇంకో స్వప్నం వస్తుంది, ఆగిపోతుంది, ఇలా ఎన్ని స్వప్నాలు వచ్చినా అవి అన్నీ అసత్యములే అలాగే నీవు ఎన్ని జన్మలు ఎత్తినా ఇవి అన్నీ అసత్యములే. మనకు మెలుకవ వచ్చాక అంటే మన హృదయంలో ఉన్న మరణంలేనివస్తువు అనుభవంలోనికి వచ్చాక, ఇంతకుముందు ఎక్కడికెక్కడికో వెళ్ళిపోయాము, ఎన్నిసార్లు పుట్టాము, ఎన్నిసార్లు చనిపోయాము అని అనుకొన్నాం, కాని ఏమీలేదు ఇక్కడే ఉన్నాము అనిపిస్తుంది అది అమృతానుభవం, ఇది పిక్షన్ కాదు, అనుభవైకవేద్యం. మనకు ఈశ్వరుని పట్ల అకారణ భక్తికుదరాలి, అకారణప్రేమకుదరాలి, నిష్కామకర్మ ఎంత ముఖ్యమో నిష్కామభక్తి కూడా అంతే ముఖ్యం, ఇవన్నీ మనకు జ్ఞానోదయానికి సహకరిస్తాయి, చాలామంది మోక్షాన్ని కోరుకోరు, ఎందుచేతనంటే మోక్షాన్ని కోరుకొంటే మనకు శరీరం ఉండదేమో, ఈ శరీరం లేకపోతే మనం ఉండము అని అనుకోవటంవలన మోక్షాన్ని కోరుకోము, ఏవో కోరుకొంటూ ఉంటాము. మరిగాఢనిద్రలో శరీరం లేకుండా, మనస్సు లేకుండా, లోకం లేకుండా మనం ఉన్నాము కదా,

మనం ఎక్కిడికోవెళ్ళిపోదాం అనుకొంటున్నాము కాని మనం తెలుసుకోవలసిన వస్తువు మన హృదయంలోనే ఉంది. మనం బయటకు దూసుకొని వెళ్ళటంకాదు, లోపలకు వెళ్ళాలి. అది ఒక శరీరాన్ని పట్టుకొని వేలాడదాము అని అనుకోదు, అది మన హృదయంలో ఉంది, అంతటా వ్యాపించి ఉంది. మనం ఏదో ఒక శరీరాన్ని పట్టుకొని వేలాడుతున్నాము, ఇదే మనం అనుకొంటున్నాము, ఇంక అదిమనకు దొరికేదిలేదు. అంతటా వ్యాపించి ఉన్న వస్తువును ఏదో ఒక శరీరానికి కుదించేసుకొంటున్నాము అక్కడ నుండి వ్యక్తిభావన ప్రారంభమవుతోంది, దానినిబట్టి కాలచక్రంలో, కర్మచక్రంలో కొట్టుకొనిపోతున్నాము. మన హృదయంలో ఉన్నవస్తువు మనకు తెలిస్తేగాని ఈ కాలచక్రంలో నుండి, కర్మచక్రంలోనుండి బయటపడలేము. మనం మిధ్యానేనును ఎక్కువగా అలంకరించుకొంటున్నాము. అందుచేత నీ ఇంద్రియాలకంటే, నీమనస్సు కంటే, నీదేహంకంటే, నీ భావాలకంటే అత్యంత సమీపంగా నీ హృదయంలో వస్తువు ఉన్నప్పటికి ఈమిధ్యానేనువలన అది నీకు తెలియబడటంలేదు,

ఆవస్తువు మనకు దగ్గరగా ఉండటంకాదు, అదిమనమై ఉన్నాము. అది తెలియకపోతే ఎంతోదూరంలో ఉంది అనిపిస్తుంది, తెలిస్తే ఇక్కడే ఉంది అనిపిస్తుంది. మనం భగవంతుడిని స్మరించుకొంటున్నాము అంటే అది ఆయన దయవలననే ఆయనను స్మరించుకొంటున్నాము అంతేగాని అది మీ తెలివితేటలుకాదు. ఆయన దయలేకుండా ఆయనను స్మరించలేము, ఆయనను పొందలేము అనే భావనే మనకులేదు, భావసౌందర్యము లేనివాడికి హృదయసౌందర్యం ఎలా తెలుస్తుంది. అంతా భగవంతుడి దయవలననే జరుగుతోంది, అంతా ఆయనే అనుకొన్నప్పుడు మనస్సు అక్కడ నిలబడిపోతుంది, కదిలే అవకాశంలేదు,

శివుడిని మనం ఎందుకు ఆశ్రయించాలి అంటే ఆయన కాలచక్రంలో లేడు, కర్మచక్రంలో లేడు, ఆయనను ఆశ్రయిస్తే అక్కడికి తీసుకొనిపోతాడు. భయపడేవాడిదగ్గరకు వెళితే వాడు మన భయాన్ని పెంచేస్తాడు. భయరహితస్థితిని పొందాలంటే భయం ఎలా ఉంటుందో తెలియని వాడిని ఆశ్రయించాలి. భయం ఎలా ఉంటుందో తెలియనివాడు శివుడు, ఆయనను ఆశ్రయిస్తే అభయస్థితిని ప్రసాదిస్తాడు, అదే మోక్షం. మనం కోరికవలనపుడుతున్నాము, కోపంతోటి, భయంతోటి బతుకుతున్నాము, ఏదోకాలం వచ్చినప్పుడు మరణిస్తాము, ఇవన్నీ లేనివాడిని ఆశ్రయిస్తే మనం తరిస్తాము, వాడే మల్లిఖార్జునుడు, శివుడు కళ్ళులేకుండా చూడగలడు, కాళ్ళులేకుండా నడవగలడు, చెవులు లేకుండా వినగలడు, శివలింగానికి కళ్ళు, చెవులు ఏమీలేవు అలాగని ఏమీచూడలేడు, ఏమీ వినలేడు అనుకోవద్దు, అవయవాలు ఏమీలేకపోయిన ఆయన వినగలడు చూడగలడు, ఈ సృష్టినంతానియమిస్తూ ఉంటాడు. జరిగేది శివసంకల్పం, అనుకొనేది జీవసంకల్పం. ఆయన ఉన్నాడు మనంలేము, కాని మనం ఉన్నాము ఆయనలేడు అని అనుకొంటున్నాము, అదే అజ్ఞానం. మనలను మనం చూసుకొని లోకాన్ని చూస్తే లోకం లోకంగా కనబడదు, బ్రహ్మంగానే కనబడుతుంది. బ్రహ్మానందులోకం కల్పించబడింది. బ్రహ్మానుభవం పొందినవాడు ఆభవసుఖాన్ని పొందుతాడు. ఆభవసుఖం అంటే ఆత్మసుఖం. ఆత్మపుట్టదు, ఆపుట్టని దానిని ఆశ్రయిస్తే మనం కూడా పుట్టుకలేనిస్థితిని పొందుతాము లోపలఉన్న వస్తువుకు పరిమితులులేవు కాని మనందేహానికి పరిమితమై ఉన్నాము, మనస్సుకు పరిమితమై ఉన్నాము అందుచేత అది వ్యక్తం కావటంలేదు. లోపల వస్తువు ఉంది కాని అది మనకు తెలియటంలేదు అని అనుకోవటానికి కూడా శివుని దయ ఉండాలి లేకపోతే అలాగ కూడా మనకు అనిపించదు, అసలు వస్తువే లేదు అనిపిస్తుంది. శివుని దయలేకపోతే మనస్సు ముల్లంతకూడా లోపలకు వెళ్ళదు. మీ మనస్సు చల్లబడుతోంది అనుకోండి, మీ మనస్సుకు చాపల్యం తగ్గుతోంది అనుకోండి అది శివుని దయ అనుకోండి. మనం మరణంలేనిస్థితిని కోరుకొంటూఉంటే మరణంలేనివాడిని పట్టుకోవాలి అంటే మరణంలేని శివుడిని మనం పొందేవరకు మరణం మనలను విడిచిపెట్టదు.

**05-05-2004**



# అధ్యాపకుడికి అబ్రహాంలింకన్ లేఖ

మనుష్యులందరూ నిజాయితీపరులుకారని, చాలామంది నిజానికి కట్టుబడి ఉండరని నా కుమారుడికి తెలియజేయవలసిన అవసరం మీకుందని నా గట్టినమ్మకం. ఈవిషయం ఎంత స్పష్టంగా నా కుమారుడికి తెలిపితే అంత మంచిది. ధీరోదాత్తుడైన వ్యక్తి ఉన్నట్లే ఎప్పుడూ ఒక దగాకోరు కూడా ఉంటాడని, ఒక స్వార్ధపరుడైన రాజకీయనాయకుడు ఉన్నట్లే అంకిత మనస్తత్వంతో కూడుకున్న ఒక గొప్ప నాయకుడు కూడా ఉంటాడని మా వాడికి మీరు బోధించండి. ప్రాణమిత్రుడు ఉన్నట్లే ప్రాణాలు తీసే శత్రువు కూడా ఉంటాడని మా అబ్బాయికి తెలియజేయండి. వాస్తవం ఎంత చేదుదైనా దాన్ని భరించగలిగేశక్తి మాబాబుకు ఉండేలా ధైర్యాన్ని నూరిపోయండి. అమూల్యమైన మీసమయం తీసుకుంటున్నందుకు మన్నించగోరుతాను. అయినా ఒక తండ్రిగా నేను నాఅభిప్రాయాలను మీముందు ఉంచకతప్పదు. అందుకు క్షంతవ్యుణ్ణి. ఉన్న ఫళంగా వచ్చిన అయిదు డాలర్లకన్నా చెమటోడ్చి కష్టపడి సంపాదించిన ఒక్క డాలరు విలువే చాలా ఎక్కువని నా కొడుకుకు చెప్పండి. కష్టార్జితంలో ఉన్న సుఖం, ఆత్మ తృప్తి అడ్డగోలు సంపాదనలో ఉండదని నా చిట్టితండ్రికి స్పష్టం చేయండి. సత్యమే జయమని పదేపదే చెప్పండి. ఓడిపోవడంలో ఉన్న దుఃఖం ఎంత బాధగా ఉంటుందో, గెలిచినప్పడు కలిగే సంతోషం ఎంత హాయిని యిస్తుందో మాబాబుకు బాగాతెలియజేయండి. గెలుపు ఓటముల సయ్యాట ఎలాంటిదో తెలపండి. అసూయ నుంచి, అమాయకత్వం నుంచి అజ్ఞానం నుంచి, అంధకారం నుంచి మాబాబును దూరంగా తీసుకువెళ్ళండి. మంచితనం మమకారం, మానవత్వం, మృదుస్వభావం గురించి తెలియజేయండి. ఇది మీధర్మం. చిరునవ్వులో ఉన్న సొగసును, కోమలస్వభావంలో ఉన్న గాంభీర్యాన్ని నా చిట్టితండ్రికి తెలపండి. మొరటుతనానికి, మూర్ఖత్వానికి మాబాబును దూరంగా ఉంచండి. కఠినాత్ములు నమ్ముకునే శిలాశాసనాలు దయామూర్తుల అమృతహృదయాల ముందు దిగదుడుపని తేల్చిచెప్పండి. అంతే కాదు పుస్తకాలలోని విజ్ఞానవిశేషాల గురించి వింతలువిడ్డూరాల గురించి మా చిన్నారి గుండెల్లో నింపాదిగా నింపండి దానితోపాటు ఆ సృష్టిలోని అందాల గురించి, అద్భుతాలగురించి తెలియజేయండి. ఆకాశంలోని పక్షుల గురించి, లేతెండలో తిరుగాడే సీతాకోకచిలుకల గురించి, కనువిందు చేసే రంగురంగుల పూల గురించి, కొత్తసొగసులు సింగారింప జేసుకున్న కొండలోయలగురించి కూడా మాబాబుకు తెలియజేయండి. గలగలమని పారే సెలయేరుల గురించి, రెపరెపమని తలలూపే పంటచేల సోగసుల గురించి, నిండుగుండె సవ్వడుల గురించి, బంగారు కలలను పండించుకుని శ్రమజీవన

సౌందర్యం గురించి మా చిట్టితండ్రికి అర్థమయ్యేలా విడమరచి చెప్పండి.

సర్వ సామాన్యంగా,హుందాగా, మృదువుగా, నిజాయితీగా ఉండడం గురించి చెప్పండి.మోసం చేసి బ్రతకడం ఎంత నికృష్టమైందో స్పష్టం చేయండి. ఎప్పుడూ కూడా స్వంత ఆలోచనల మీద నమ్మకం పెంచుకోమని, ఎవరుఎంతగా చెప్పినా ఆ నమ్మకాన్ని సడలించుకోరాదని మాబాబు లాంటి చిన్నారులకు మీరెప్పుడూ చెప్పండి. కఠినంగా వ్యవహరించే వారిపట్ల శాంతస్వభావంతో మెలగమని ప్రబోధించండి. క్రోధం కన్నా శాంతం ఎంత గొప్పదో ఆ చిన్ని హృదయానికి అర్థమయ్యేలా చూడండి. ప్రేమను మించిన మార్గంలేదని మా బాబుకు పదేపదే చెబూతూ ఉండండి. “నలుగురితో నారాయణా” “గుంపులో గోవిందా” అనడం అభిమతం కారాదని, ఆ గుంపును గుండె ధైర్యంతో నడిపే సామర్థ్యాన్ని, ఏ కష్టాన్నైనా ఎదుర్కొనేశక్తిని పెంచుకోవాలని ప్రస్ఫుటం చేయండి. నిజానికి కట్టుబడి పనిచేసే ధైర్యాన్ని,తెగువను నూరిపోయండి విషాదం కలిగినప్పుడు హాయిగా నవ్వడం అలవాటు చేయండి. ఓడిపోవడం సిగ్గు పడవలసిన విషయం కాదని స్పష్టంగా చెప్పండి.ఓడి పోండం తప్ప చేయడం కాదని తెలపండి.ఓటమి గెలుపుకు బాసటగా నిలిచే బంగారుబాటని తెలియజేయండి.

పోతే పుస్తకాలద్వారా నేర్చుకున్న విజ్ఞానం కన్నా హృదయం గొప్పదని చెప్పండి. హృదయపూర్వకంగా పదిమందికీ పంచిపెట్టే ప్రేమకన్నా గొప్పది ఏదీలేదని నా చిట్టితండ్రికి అర్థమయ్యేలా పదేపదే నూరిపోయండి. నిజం కోసమే పోరాడమనండి. నిజమే జీవితమని నొక్కిచెప్పండి ఆ లేతబాలుని గారాబం చేయకండి, అలాఅని కఠినంగా శిక్షించకండి. ఇనుమును సాగతీయాలంటే వేడిచేయక తప్పదని మా అబ్బాయికి కూడా అర్థమయ్యేలా చూడండి. వెన్నపూసలాంటి నా కుమారుడిని వెతలుబాపే వేల్పుగా తీర్చిదిద్దండి. మహాత్ముడిని చేయండి. సహనాన్ని గురించి బాబుకు పదేపదే చెప్పండి. మంచి తనంలో, మానవత్వంలో ఉన్న మధురిమ గురించి మాబాబుకు సున్నితంగా వివరించి చెప్పండి. కలిసిమెలిసి బ్రతకడంలో, కష్టసుఖాలు పంచుకోవడంలో ఉన్న ఆనందం స్వర్గంలో కూడా దొరకదని మా వాడికి చెప్పండి. మావాడు చాలా చిన్నవాడు, పసివాడు. మీ సహకారం, అనురాగం ఉంటే కొండంత కాగలడు. మీరు గురుదేవులు మీ చేతిలోనే జాతి భవిష్యత్తు పదిలంగా భద్రపరచబడిఉంది. మీ కర్తవ్యాన్ని మీరు నిర్వహిస్తారని ఆశిస్తూ ...

మీ అబ్రహాంలింకన్.



## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| 13-05-2004 | నుండి | |
| 21-05-2004 | వరకు | అరుణాచలం క్యాంపు |
| 20-06-2004 | ఆదివారం | జిన్నూరు శ్రీ రమణక్షేత్రం |

# నిజమైన అభివృద్ధి

అశాశ్వతమైన అనగా నశించే వస్తువులు,పదార్థముల నుండి అభివృద్ధిని,విజయాన్ని, ఆనందాన్ని కోరుకొనుటయే మనముచేయు గొప్ప పొరపాటు. సత్యము కానిది శాశ్వతము కాదు. సృష్టిలో ప్రతీది మార్పుకు లోనయ్యేదే.అట్టి భ్రాంతిరూప సృష్టికి ఆధారమైన ‘తత్త్వము’ మాత్రము శాశ్వతమైనది, మార్పులేనిది, అదియే బ్రహ్మము. అదియే ‘నిజమైన నేను’. దేహేంద్రియ మనోబుద్ధులకు, దేశకాలములకు అతీతమైన మన నిజతత్త్వాన్ని ఎరుక లోనికి తెచ్చుకొనుటకు మనము చేసే ప్రయత్నమే నిజమైన అభివృద్ధిగాను, నిజమైన ప్రయత్నముగాను చెప్పవచ్చును. అదియే ఆధ్యాత్మిక అభివృద్ధి, అదియే మానవ జీవిత సారము. అట్టి వారికి లౌకిక జీవితం కూడా ఆనందదాయకంగా ఉంటుంది. వాసనలతోనూ, సంస్కారములతోనూ కూడియున్న మనస్సును శుద్ధి చేసుకోవడమే నిజమైన ఆధ్యాత్మిక అభివృద్ధి. దేహేంద్రియ మనోబుద్ధులతో మనకున్న తాదాత్మ్యము మరియు విషయవాసనలు మన ఆధ్యాత్మిక అభివృద్ధికి ఆటంకములు. పరిసరములు, పరిస్థితులు, బాహ్యవస్తువుల వల్ల దుఃఖం రాదు, కర్తృత్వం వల్ల దుఃఖం వస్తుంది. వివేకవైరాగ్యముల ద్వారా దేహేంద్రియ మనోబుద్ధుల మధ్య సమన్వయము కుదిరితే, త్రికరణశుద్ధి కలిగితే, అది మన ఆధ్యాత్మికఅభివృద్ధికి దోహదమవుతుంది. వివేకవైరాగ్యములు లోపిస్తే అదే మన పతనమునకు కారణమవుతుంది. సమస్త సాధనలు సాధకుని వ్యక్తిభావనను పోగొట్టుటయే లక్ష్యముగా కలిగియున్నవి. ఖండభావన నశిస్తే అఖండముగా ఉంటాము.

చావలి సూర్యనారాయణమూర్తి

అమలాపురం